


# హరీష్ చంద్ర

ఆ అందమైన భవనంలో ఒక స్త్రీ సమాజం రన్నవుతున్నది. ఆ క్లబ్ మెంబర్స్ తీరిక సమయంలో వచ్చి పిచ్చాపాటి కానిచ్చి ఆనందిస్తారు. కొంతమంది హృదయ భారం, విసుగూ తగ్గించుకోటానికి వస్తారు. మరికొందరు తమలో పెరిగిపోతున్న కసిని కంట్రోల్ చేసుకోవటానికి వస్తారు. రకరకాల వయస్సులు, వేషాలు కంటబడతాయి. ఆర్డ్డాక్సు నుంచి అధునాతన వేషభాషలు, అలంకారాలూ కంటబడతాయి. ఫౌండర్ పేరు వినోదిని. సమాజం కలకలలాడుతూ, సభ్యుల సంఖ్య పెరగాలని సభ్యులనాకర్షించే మార్గాలు తొక్కింది. ఆమె వుద్దేశం క్లబ్ గూడా వ్యాపారేమేనని. విదేశాలు పయనించి క్లబ్ రన్ చేసి యింప్రూవ్ చేసే పద్ధతులు నేర్చుకొచ్చింది. సమాజం యించుమించు రోజంతా రన్నవుతుంది. ఫాన్లూ, దీపాలూ పనిచేస్తాయి. అనుబంధంగా, డ్రింకులున్న గదీ, సర్వ్ చేసే యువతి, చిన్న రెస్టారెంటు, బెల్ కొడితే వచ్చి యెదురుగా నిలబడే అబ్బాయిలూ అమ్మాయిలూ వున్నారు. చిన్న మెడికల్ హాలూ సర్జరీ వున్నాయి. డాక్టరమ్మ వున్నది.

ఇండోర్ గేమ్సుకి, ఔట్‌డోర్ గేమ్సుకి వసతి వున్నది. పండగలు, పర్వదినాలు, పూజలు, పురస్కారాలు , నోములూ, వ్రతాలూ, ఫంక్షన్స్, దసరా, సంక్రాంతి, పుట్టిన దినము, వెడ్డింగ్ ఆనివర్సరీ, స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే జరుపుకోవచ్చు.

టెన్నిస్ ప్రియుల కోసం, కోర్ట్ ఫ్లడ్ లైట్సు వున్నాయి. దూరదర్శన్‌లో ఫిట్ అనే ప్రోగ్రామ్ చూపుతుంటే పదినిమిషాలు వ్యాయామం నేర్చుకోవచ్చు. జాతిపిత పుట్టినరోజున రఘుపతి రాఘవ రాజారామ్ అని బృందగానం జరుపుతారు. ఇష్టమున్నవారు పోటీలు జరుపుకోవచ్చు. ఏకాంకికలు, సాంస్కృతికోత్సవం, సారస్వత చర్చ జరుపుకోవచ్చు. ట్రెజర్ హంట్, క్విజ్ కార్యక్రమం మిమిక్రీ చూపించవచ్చు.

మంచి సెక్రెటరీ కుదిరింది. ఆమె పేరు శారద. పన్నెండు భాషలలో తప్పులు దొర్లకుండా సంభాషిస్తుంది. హాస్యానికి అన్నీ కలగాపులగం చేసి మాట్లాడుతుంది. ద్రావిడ భాషలూ, ఉత్తరాది భాషలూ వచ్చు గనక, క్లబ్బుకి పత్రికలు తెప్పిస్తుంది. చేతనైనవారు రచనలిస్తే పబ్లిష్‌చేయిస్తుంది. ఆమె వయస్సు కనిబెట్టలేరు. హెవీ మేకప్. చలాకీతనం. మనుషులతో మసులుకోటం వచ్చు. పతివ్రతల మధ్య పతివ్రతలాగా, స్వేచ్ఛా ప్రణయం గౌరవించేవారి మధ్య వారి లాగే మాట్లాడుతుంది.

మెంబర్సుకు వీలున్నప్పుడే క్లబ్బుకు రావచ్చు. నడిరేయి నుంచి బ్రాహ్మీ ముహూర్తం వరకు క్లబ్బు మూయుబడును అంతే. స్త్రీలే ఆ క్లబ్బుని నడుపుతున్నారు. పోతు టీగక్కూడా క్లబ్‌లో మెంబర్‌షిప్ యివ్వబడదు. మన్నన, మర్యాదా, దాసభావం, మైత్రి, సభ్యత నేర్పుతారు.

అట్టి సమాజంలో ఒకనాడు కొందరు సభ్యులు గుండ్రని బల్ల చుట్టూ వున్న కుర్చీలలో కూచుని చీట్ల పేక కలిపి పంచి రమ్మీ ఆడుతున్నారు. వారి వయస్సు ముప్ఫై యాభై మధ్య వుంటుంది. ఆ డజను మందీ చదువుకున్న వారే. ఉద్యోగినులే.

పక్కనే గదిలో విద్యార్థినులు బిలియర్డ్స్ ఆడుతున్నారు. దానికివతల గదిలో, వయసు మళ్లిన స్త్రీలు మెత్తలున్న సోఫాల్లో కూచుని, పిండివంటలు, వూరగాయలు, మనుమలు మనుమరాండ్ర గురించీ వూసులాడుతూ నవ్వుతున్నారు.

వేరే గదిలో లోకాభిరామాయణం యెత్తుకున్నారు వనితలు.

క్లబ్బు పేరు వనితా విహార్.

మల్లిక ముక్కలు పేరుస్తూ అన్నది ''మందాకినీ, అందరూ బిడియం లేకుండా, మొగుళ్లను కడగటమో, పొగడటమో తెగనాడటమో చేస్తుంటే, నువ్వు

ముంగిలాగా చూస్తూ వుంటావేం? నోరు విప్పవు. పోనీ అబద్ధాలన్నా పేలవు. నీ స్పెషాలిటీ యేమిటీ? నువ్వూ యేదో ఒకటి చెప్పాల్సిందే. శ్యామాని చూసి నేర్చుకో. ఒక్కనాడు గూడా తన మొగుణ్ణి పొగడకుండా, క్లబ్ వదలదు. నిన్ననే అన్నది ''మా ఆయన పదివేలు చేబదులు తెచ్చాడు. గుల్‌బర్గాలో చదువుతున్న మా అబ్బాయికి పంపాల్సి వచ్చింది. బీరువాలో లేదు. సమయానికి బాంక్‌లోనూ ఆయన పేర అంత లేదు''. అంటే వాళ్లాయనకు యెంత పరపతి వున్నదో చెప్పిందన్నమాట. అంతేనా కూతురు సుఖపడాలని కట్నం కుమ్మరించి పొజిషన్లో వున్న అల్లుణ్ణే యెన్నిక చేసి తెచ్చాడుటగానీ, తన పెళ్లికి కానీ గూడా కట్నం తీసుకోనన్నాడట. సెరిమొనీ గూడా ఆర్భాటంగా చేయద్దన్నాడుట. పెద్దల తృప్తి కోసం పుస్తెలతాడు మూడు ముళ్లూ వేశాడటగానీ, తలంబ్రాలూ, చదివింపులూ, అలకపాన్పూ అన్నీ మైనస్‌ట. తాడు కట్టటమనేది యిస్లామ్ నుండి నేర్చి అనుకరించారుట. వాళ్ల నిక్కా అంటే మనం తాడు అన్నాముట. వేదకాలంలో, మాట ముఖ్యం. నాతి చరామి అని పెద్దలెదుట అనే వారుట. ఒక స్పెషల్ పూలతీగ స్త్రీ మెడకు చుట్టివుంటే పెళ్లైందని గుర్తుట. వేదకాలంలో మెటల్స్ వాడే ఆచారం లేదేమో. బంగారానికి విలువ కట్టలేదేమో. తవ్విన ఖనిజాన్ని నిప్పులో పారేస్తే యేదో పచ్చగా ద్రవరూపంలా ప్రవహించింది. ఫర్నెస్ చల్లబడగానే ఆ ద్రవం గట్టిబడటం చూచారు. అదే మెరిసే పచ్చని బంగారం'' వాగుతూ సెట్టు చేస్తున్నది.

దౌలత్ అన్నది ''మందాకిని ఫిలాసఫర్. జ్ఞాని. జ్ఞానే మౌనం అన్నాడు. చెడు వాగదు. నిండుకుండ'' అన్నది ముక్కలు చూస్తూ.

తనకిచ్చిన కితాబుకి మందాకిని నవ్వింది. ''మెనీ థాంక్స్ ఫ్రెండ్ ఫర్ ది కితాబు. నమ్మరేమోనని మాట్లాడను. అతిశయోక్తివేస్తూ మాట్లాడుతుందని అనుకుంటారని చెప్పను'' తయారైన సెట్ బల్ల మీదుంచింది.

''అమ్మో! మందాకినీ! అప్పుడే కుదిరిందీ! మేమంతా కూడాలేమో''

కౌసల్య తన ముక్కలు బల్లమీదుంచి లెక్కించ సాగింది. అందరూ ముక్కలు వెల్లికలా వుంచి లెక్కించారు. కౌంటర్ పాయింట్స్ పంచారు. తరువాత వెళ్లేప్పుడు నిజం డబ్బు చెల్లిస్తారు. ఆ డబ్బు క్లబ్బుకి వెళ్ళుతుంది.

సరోజినీ జాన్సన్ పేకంతా కలిపి షఫుల్ చేసి పంచింది. మధ్య బొత్తి వుంచింది. పద్మినీ యూనిస్ తన ముక్కలందుకున్నది. పార్వతీ మీనన్ ముక్కలు అమరుస్తూ అన్నది. ''అనుకుంటే అనుకుంటారు మందాకినీ. నువ్వూ చెప్పాల్సిందే. యేదైనా వింటాం. ముంగి లాగా చూస్తే ముంగి ముశానమ్మ అని నిక్ నేమ్ పెడతాం''.

సుసాన్ సెట్టు చేస్తూ అన్నది ''విడుదల చేయబోయే చిత్రానికి పబ్లిసిటీ యిచ్చినట్టు, మందాకిని వాళ్లాయనకు పబ్లిసిటీ యిస్తున్నది. బౌద్ధ బిక్షువులు అశోకునిచే మతవ్యాప్తి చేయమని పంపబడి జోర్డాన్ వరకు వెళ్లారుట. బుద్ధుని బోధలు వ్యాప్తి చేస్తూ పబ్లిసిటీ యిస్తూ దే ప్రిపేర్డ్ ది గ్రౌండ్ ఫర్ క్రిస్టియానిటీ అని ఒక గొప్ప రీసెర్చ్ స్కాలర్ హేవెల్ యిరవైయేళ్లు శ్రమించి పరిశోధించి వ్రాశాడు. అప్పటికి వయిలెన్స్ మితి మీరుతున్నది. సో కొంతమంది యూదు పండితులే కొత్త మతం స్థాపించారుట. మూర్ఖత్వాన్ని బార్బారిజాన్ని తుడిచివేసి దయ, అహింస వ్యాప్తిలోకి తేవాలని వారి ఆశయంట''. '' నా సహచరుడు జీసస్సూ గాదు. నేను జ్యూ స్కాలర్నీ గాదు'' అన్నది మందాకిని. ఇంకొక్క ముక్క వస్తే సెట్ పూర్తి ఔతుందని చూస్తున్నది. ఆనందవల్లి అడిగింది ''అలా అంటావేం మందాకినీ! మా ఆయన అనవు. మొగుడనవు'' ముక్క అందుకుని చేతిలోది కిందబడేసింది.

''అలా అనద్దన్నాడు. మొగుడెవర్దైందీ తెలియనివ్వగూడదుట. డేంజరుట'' తలెత్తకుండానే అన్నది మందాకిని.

అమృతం నవ్వింది, '' అరుంధతీదేవి, చంద్రమతికి వరమిచ్చిందట 'నీ మంగళసూత్రం నీ భర్తకి తప్పితే యెవరికీ కనపడదు' అని ''కాటి సుంకం

చెల్లించాలి మాడ యివ్వు అంటే, లేదు లేదంటావేం? అది అమ్మి మాడ తీసుకురా. నా కివ్వాల్సిన బియ్యం, కొత్త గుడ్డా వదిలేస్తాలే. బానిస నంటున్నావు'' అనంగానే ఆ కాటికాపరి తన భర్తేనని గుర్తించి హా! అని పడిపోయింది చంద్రమతి. అలాగా నీ తాడూ సూత్రాలూ కనపడని పదార్థంతో చేయించి కట్టాడేమో'' అన్నది. తక్కిన వాళ్లవంక చూసింది. వాళ్లూ నవ్వారు.

''మాకు కనపడటం లేదు నీ సూత్రం'' అన్నది నవనీతం.

''కట్ట లేదసలు. అలా కట్టకపోతే యేమిటి బాధ ? వదిలేయను గదా. మాట మీద నిలబడాలి అంతే'' అని పెద్దలనెదిరించాడు.

రమ్మి సాగుతూనే వున్నది. దీపాలు వెలిగాయి.

భారతి అడిగింది ''మరి పిల్లకాయలు కలిగారు. వారేమని పిలుస్తారు తండ్రిని? అప్పా! అయ్యా! నాన్నా! అనరా?''.

''అనరు. ఇంజనీరు గారూ! అని పిలుస్తారు'' అన్నది తాపీగా.

''అది నిజమేనర్రా. వాళ్ళబ్బాయి ఎంట్రెన్స్ పరీక్ష వ్రాసి స్కూల్లో చేరాలి. తండ్రికి వుత్తరము అని యిచ్చారు. ఆ చిన్న అబ్బాయి, ఇంజనీరుగారికి అని ఎడ్రస్ చేస్తూ వ్రాశాడు. హెడ్ మిస్ట్రస్ ఆశ్చర్యపోయింది'' అన్నది టీచరు యిందిర.

''మరి పేర్లు పెట్టలేదూ? నేమింగ్ సెరిమొనీ చేయాలే ! పేర్లు నమోదౌతాయి. ఓటింగ్ హక్కు వస్తుంది'' అన్నది లాయరు విశాల.

''మొదలు లేదు శ్రీరామా మొలతాడులేని గోచీ'' అని నవ్వింది మందాకిని, ''డి వన్, డి టు, యస్ వన్, యస్ టూ అని పెట్టాడు''.

''కెమికల్ యింజనీరా? కెమిస్ట్రీ మెయినా? అలా చెల్లుబడిగావే పేర్లూ'' అన్నది కుసుమ, ఫార్మసీ లెక్చరర్.

''వాళ్ల పేర్లు వాళ్లే బడిలో చేరగానే నమోదు చేసుకున్నారు''.

''మరి నిన్నేమని పిలుస్తాడు యింజనీరూ? అసే, ఇసే, వశీ యేమోయ్, మందాకినీ అని పిలుస్తాడా? యాక్సిడెంటల్‌గా మీ రిద్దరూ జతగా మా కంటబడితే యెవరని అడిగితే యేమనేవాడు యింజనీరు?''.

''నలుగురూ నవ్వుతారు కూడా రావద్దని కట్టడి చేశారు''. ''యిదేనా నీ సహచరి?'' అంటే నాకు నొప్పి కలుగుతుందిట. పొరపాటున యెవరన్నా యిద్దర్నీ నడుస్తుండగా చూసి, తెలియక, కల్చర్ లేక, ''యెవరు?'' అనడిగితే, ''తెలిసిన మనిషి'' అనేవారు. నవ్వుతూనే చెప్పింది మందాకిని.

''నమ్ముతామనే అనుకుంటావా?'' అన్నది శాంతా గేబ్రియల్.

''నమ్మమని నేననటం లేదు. నమ్మరనే మాట్లాడనన్నాను. మరిచారే'' అన్నది మందాకిని. మరొక రౌండ్ ముక్కలు కలిపి పంచే వంతు ఆమెకి వచ్చింది.

''అబ్బే. వీల్లేదు. చెప్పాల్సిందే. కుతూహలంబయ్యెడిన్''.

హనుమాయమ్మ ప్రిన్సిపాల్ అడిగింది '' ఆ సహచరునే అంటి పెట్టుకునున్నావే మందాకినీ. పతివ్రతల కోవలో దాన్నంటున్నావా?''.

''అనటం లేదు. చంద్రమతితో పోల్చారు మీరే. కొడుకు లోహితాస్యుడు పెద్దవాడై ప్రయోజకుడై సుఖపెడతాడనీ, ఆ కొడుక్కి తన తల్లి కారెక్టర్ మంచిదనే అభిప్రాయం కలగాలనీ భర్తననుసరించింది. తండ్రి కొడుకుని అమ్మలేదు. వాడు స్వేచ్ఛ గలవాడే. గాంధారి పతికిలేని దృష్టి తనకూ వద్దని గుడ్డ కట్టుకున్నది. గాంధారి కొడుకు రాజరాజు, మరిది పిల్లలు పాండవులని అవమానిస్తూ తోలేస్తూ వుంటాడు. అంతరంగల గాంధారికది యిష్టమే. ధర్మజుని గురించి విని అసూయకుగురై, తన కడుపు పండలేదని గుద్దింది. భీముని బలం గురించీ వినలేకపోయింది. మొగుడూ అంతే. చివరికి భీముని చంపాలని కౌగలించుకుంటా రమ్మని పిలిచాడు. కృష్ణుడు గ్రహించి యినపబొమ్మ జరిపాడు. భార్యా భర్తల ఆశయాలు ఒకటే. అందుకని అంటి పెట్టుకుని వున్నది. అలా స్త్రీ యేదో ఆశతో అంటిపెట్టుకుని వుంటుంది. నేడు గూడా అట్టివారున్నారని

దినపత్రికలో చూస్తాము. వారి చిత్రాలు గూడా పడ్డాయి. పదవి కోల్పోయినా, స్టేటస్ కోల్పోయినా, నిందలు పడ్డా, కేసుల్లో చిక్కినా అంటిపెట్టుకుని వున్నవారున్నారు. అన్ని రంగాలలో అట్టి మొగుడూ పెళ్లాలు వున్నారు'' అని సెట్ బల్లమీదుంచేసింది మందాకిని.

పరంజోతీ మరిద్దరూ తమ సెట్లు బల్ల మీదుంచారు.

''నీ సహచరుడే రంగానికి చెందుతాడు? అరిస్టోక్రాట్, ప్రొలిటేరియన్, ఇంపీరియలిస్టు, ఫ్యూడల్ ప్రభువు, సోషలిస్టు?'' అన్నది పద్మావతి.

'' ఇది చాలా అన్యాయం సగానికి సగం మందికి సెట్లు కుదర్లేదు. చచ్చాం పో. కూడితే నూరౌతుందేమో. బొమ్మకి పదిగదూ'' మెహర్ జిలానీ నుదురు కొట్టుకున్నది.

''పొలిటీషియనా, తల తిక్క వున్నవారి లిస్టులో వున్నాడా నటుడా? నిర్మాతా? నియంతా? నిర్మోహియా? పేరైనా వినిపించూ''.

''మీరు వినలేదింత వరకూ? పోనీ వూహించండి'' నవ్వింది మందాకిని. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, కంప్యూటర్ మెషీన్ నడుపుతూ, ఫాక్సు మెషీన్ వాడుతున్న సుశీల అన్నది. 'హెచ్. ఆర్. సి.'' అని మెసేజెస్ ఇమెయిల్ వస్తాయి. ఆయనని తీసికెళ్లటానికి పిల్లలు వస్తారు''.

'హెచ్ ఆర్ డి అంటే హ్యూమన్ రిసోర్సెస్ డైరెక్టరు. యన్.డి.యే. అంటే నేషనల్ డెమోక్రటిక్ యెలయెన్సు'' అలా నవ్వుతూ యేకరవు పెడ్తున్న సారా శామ్యూల్‌ని చూసి హెచ్ ఆర్ సి అంటే హరీష్ చంద్ర అని పకాపక నవ్వింది మందాకిని. 'హరిశ్చంద్రుడుగా బోలు, పంజాబీలు కృష్ణ అనటానికి బదులు కిషేన్ అంటారు. బెంగాలీలు వాహిని అనటానికి బాహిని, వంగ దేశం అనటానికి బెంగాల్ బంగదేశ్. ముజీబ్ గారిని బంగబంధు అనేవారు'' లెక్చరర్ విశదీకరించింది.

''అలా అంటే భార్య నమ్మాలి. లోహితాస్యుని పాము కాటేయాలి'' అన్నది మనోరమ రచయిత.

''యేమంటావ్ మందాకినీ? మరో పేరు చెప్పమా ?

''అక్కర్లేదు. అది సరిపోతుంది. ప్రాక్టికల్‌గా సహచరిని అమ్మలేదుగానీ హెచ్. ఆర్.సీ., యేదో మిషపెట్టి యెవరి కంటబడితే వారి వెంట పంపితే మానసిక బానిసే సహచరి'' అన్నది తలవంచుకుని.

''అది గూడా గొప్పదనం కిందే లెక్కా?''

'' ఆ. ఆ. మాట మీద నిలబడాలి. అది ముఖ్యమన్నారు గదూ. గొప్ప వుద్యోగస్థురాలు, తన చిన్ననాటి సహాధ్యాయీ సింపుల్‌గా పెళ్లాడి, రిసెప్షన్ యిస్తూ, స్వయంగా వచ్చి పిలిచింది. ఆహ్వాన పత్రిక, శుభలేఖ. ఖర్చుట. ''మా తండ్రిగారు దివికేగి ఒక సంవత్సరం పూర్తిగాలేదు. నాకు సూతకం. నేను ఫంక్షన్సులో పాల్గొన రాదు'' అన్నారు. పెళ్లికూతురు ''మీ జీవన సహచరిని పంపటానికి అభ్యంతరం లేదుగా'' అన్నది. ''తప్పకుండా పంపుతా. నో అబ్జెక్షన్'' అన్నారుట. నేను మార్కెట్ కెళ్లి కూరలు పళ్లు తీసుకుని వచ్చి యింట్లో అడుగు పెట్టాను. అంతా చెప్పి ''నువ్వు వెళ్లాలి. నేను మాటిచ్చాను. పెళ్లి కూతురు ప్రమోషను పొంది కలెక్టరయింది. పంపిస్తానని ప్రామిస్ చేశాను''.

''నాకామె పరిచయమన్నా లేదే? ఇన్‌విటేషనేదీ? వేదికా తెలియదు. వెతుక్కుంటూ వాకబ్ చేస్తూ వెళ్లినా గుర్తు పట్టరేమో'' అన్నా.

''అవన్నీ తెలిసే అరేంజ్ చేశాను. నా ఫ్రెండూ వాని భార్యా వచ్చి పికప్ చేసుకెళ్తారు నిన్ను వాళ్లే ఇంట్రడ్యూస్ చేస్తారు. నువ్వు తయారై వాకిట్లో దగ్గరుండాలి''.

''పికప్ అంటే కారులో వచ్చి తీసికెళ్తారని వూహించా. తోడ్కొని వెళ్తారని తెలియదు. సతీపతులిద్దరూ శ్రీకృష్ణుని కలరూ, నెలల బిడ్డ సతి చంకలోనూ,

చేతికొక పూసల సంచీ వేలాడుతున్నది. హైహీల్సూ, ఆర్ట్ సిల్క్ చీరా రవికా, బాబ్డ్ హెయిర్, పతికి కాటన్ సూటూ యెగ దువ్విన క్రాపూ. వచ్చారు. వచ్చి తలవూపి రమ్మని పిలిచారు. దోవ పొడుగునా బిడ్డను మార్చి మార్చి యెత్తుకుంటూ ముద్దులాడారు. వినోదిస్తూ గమ్యం చేరాము. మంటపం కిటకిటలాడుతున్నది. కుర్చీలు ఖాళీ లేవు. ఒక ఆసామీ వచ్చి బిడ్డనందుకుని వీరిద్దరినీ పిలుచుకెళ్లాడు. చాలా ప్రెజెంట్సు గుట్టలాగా అయినాయి. నయమే నేనూ తెచ్చాను అని సంతోషిస్తూ జనులను తొలగించుకుంటూ వెళ్లి నేను తెచ్చినదీ ఆ గుట్ట మీద వుంచి వచ్చేశా. పలకరింపూ లేదు. గుర్తు పట్టినవారూ లేరు. అది టీ పార్టీయనా డిన్నరా అని సందేహం కలిగింది. నించోలేక వెళ్లిపోదామనుకుంటుండగా ఒక నౌకరు కాగిత ప్లేటులో యేదో వుంచి అందించి వెళ్లిపోయాడు. కాళ్లీడ్చుకుంటూ, దోవ గుర్తు చేసుకుంటూ యింటికి వచ్చేప్పటికి రాత్రి యెనిమిది దాటింది. మీకు బోర్ కొడుతున్నదేమో'' అని ఆపింది మందాకిని.

''లేదు. లేదు కానీ. యేడున్నరే అయింది'' అని ప్రోత్సహించారు సమాజ సభ్యులు. ఆట సాగుతూనే వున్నది.

'' ఇవి జ్ఞాపకం తెచ్చుకోరాదనీ, మరిచి పోవాలనీ ప్రయత్నించాను. మరొకసారి మరొక ఫ్రెండ్ డైరెక్టరయింది. ఇన్‌స్పెక్షన్‌కి వచ్చింది. అవివాహిత. పని ముగిసింది. వెళ్లి పోతుంది. ఒక కారూ డ్రైవరూ సిద్ధం చేశారు. ఒక డాము చూపించి, రెస్టారెంటులో భోజనం చేయించి, ద్రోణాచలం స్టేషనులో, రిజర్వు చేయబడిన కంపార్ట్‌మెంటులో యెక్కించి రావాలి. ఒక స్త్రీ నాకు తోడు వస్తుంది. అదంతా నెరవేర్చి వచ్చేస్తుంటే దోవలో ఒక గ్రామంలో ఆ స్త్రీ దిగిపోయింది. అదేట వాళ్ల వూరు. నేనూ డ్రైవరు పదకొండింటికి బంగ్లా చేరాము. డ్రైవరుకి భోజనం పెట్టి పంపమన్నారు. డ్రైవరు నవ్వి ''నేనూ రెస్టారెంటులో విందు గుడిచాను సాబ్'' అన్నాడు.

సెట్స్ బల్ల మీదుంచిన సభ్యుల దిగారు. ''మరి లోహితాస్యుని పాము కాటేయటం వున్నదా? పోలిక సరిపోవద్దూ?''.

మరొక సభ్యురాలు అడిగింది ''విశ్వామిత్రుని కిస్తానన్న డబ్బుకాక, ''అది నాదారి బత్తెం. గురువు అప్పు అలాగే వున్నది'' అని నక్షత్రకుడు డబాయిస్తే రెండు చెల్లించాడు షట్ చక్రవర్తులలో మొదటివాడు'' పరంజ్యోతి పురాణగాథలు తెలుసన్నట్లు అడిగింది.

'' ఒక మోస్తరుగా చూస్తే అవీ వున్నట్టేనండీ మోడరన్ హెచ్ ఆర్ సి లైఫ్‌లో'' అని తానూ నవ్వింది మందాకిని.

''వినిపించు మరీ. మరో రౌండు ముక్కలు పంచుతున్నా''.

''తండ్రేమో గొప్పలకి పోయి కూతురు పెళ్లి వైభవంగా చేసి అప్పుల పాలైతే, సంపాదన మొదలు పెడుతూనే అవన్నీ చెల్లించాడు నక్షత్రకునికి దారిబత్తెంలాగా తోడబుట్టిన వాళ్లకూ, వాళ్ల పిల్లలకూ మనమలకూ మనుమరాళ్లకు యేదో రూపంలో అందిస్తూనే వచ్చాడు''.

ఒక రోజు అడిగాను ''తమ్మునికెందుకు? మగబిడ్డేగా? మిమ్మల్ని చదివించలేదుగా''. ''వాడికి మాస్టర్ డిగ్రీ లేదు. ఇంటి భాగం మీద హక్కు వదిలేయమన్నది నేనే. నే హెల్ప్‌ఫుల్‌గా వుంటానని ప్రామిస్ చేశాను'' అన్నారు. అన్న కెందుకంటే పెళ్లినాడు వచ్చిన బహుమానాలన్నీ అమ్మి నా ఫైనల్సుకూ, డిగ్రీ చేతికి వచ్చేందుకూ సాయపడ్డాడు. ఉపకారికి ప్రత్యుపకారం చేస్తున్నానంతే'' అని నోరు నొక్కేశారు హెచ్.సి.''

''మరి లోహిత్ కథో'' అని గుర్తు జేసింది పరంజ్యోతి.

''మా అన్న పిల్లలకి చదువు అంటేట్టూ, చదువులో ఆసక్తి కలిగేట్టు చేయి. వాళ్లు అల్లరి చిల్లరిగా తిరుగుతున్నారు. విదేశం వెళ్లి జాబ్ చేయాలని మా అన్న ఆశలు పెంచుకున్నాడు'' అని బలవంతంగా తన యింట్లో తనవారి వద్ద వదిలివేస్తే,

వాళ్ల దేంట్లో శ్రద్ధాసక్తులు చూపారంటే డిస్కో, కాబారేకి అటెండ్‌గావటంలోనూ చూసి లోహిత్‌ని ఎడ్డిక్ట్ చేశారు. గాంబ్లింగ్ హౌస్ కెల్లి కోల్పోయారు. వాటికి తట్టుకోలేక యస్‌వన్ యింటికి రాలేక మాయమయాడు. ''నీ కొడుకెటో వుడాయించాడుట డబ్బుతో సహా'' అని నన్ను యెత్తిపొడిస్తే చక్రవర్తులలో మొదటివాడు, నేను జపిస్తూ తపిస్తూ తల్లడిల్లుతూ వెతగ్గా యెక్కడున్నదీ తెలిసింది. రాన్సమ్ కింద నయమూ, వినయమూ చాకిరీ వంటా పెట్టూ చెల్లించి యస్ వన్‌ని యింటికి తేగలిగాను. షట్ చక్రవర్తులలో మొదటివాడు అప్రతిష్ఠకు వెరిచి, వైద్యం చేయించి శక్తియుక్తులు వాడి, గొప్పవాడిని చేసి గొప్పవారి మార్గాలు. రాజబాటా చూసి అటువెళ్లమన్నాడు. అపుడు నాకు త్రిమూర్తులను యీ కళ్లతో చూసినట్లయింది'' అని ఆపేసింది మందాకిని.

''మరి డివన్ డిటుల సంగతేం చేద్దాం? యెనిమిదే అయింది. కానీ'' ముక్కలు పంచుతున్న హనుమాయమ్మ అన్నది.

''అదీ అంతే. ఫ్రెండ్సు, సాటి ఆఫీసర్స్'' బోయిస్‌లాగా డ్రెస్ చేసి బోయిస్‌ని చదివించినట్టు చదివిస్తున్నావే? యెన్నాళ్లు దాచగలవ్? వయసొచ్చేస్తోంది త్రీడీస్ కీ. డౌరీ పోయాలి. సనిస్లాలను వెతకాలి. సెరిమొనీస్ మాటేమిటి? సమ్మర్ క్రాప్, పాంట్ షర్టుతోనే కన్యాదాన కార్యక్రమంలో కనిపిస్తారా డీస్?'' అని జోకులు జోకారు.

''అంత బాధ వుండదు. వాళ్లు చదవగలిగితే మాస్టర్ డిగ్రీ చేతికందే వరకు హెల్పు చేస్తా. తక్కిన వ్యక్తిగత విషయాలు వాళ్లే చూసుకోవాలి. ఆ మాట నిలబెట్టుకున్నారు'' అన్నది మందాకిని.

''మందాకినీ అవన్నీ గొప్పతనం కిందకే జమ చేద్దాము. అయోధ్య భవంతి వున్నదని విన్నాము. తన వంతు వాటా అమ్మి, మోడరన్ ఫ్లాట్ కొనుక్కోవచ్చు. అద్దె యిల్లెందుకు? స్వతంత్రంగా వుండచ్చు'' లాయర్ విశాల పకాపక నవ్వింది.

''అంత నవ్వెందుకు? నాక్కూడా చెప్పు. నేనూ నవ్వుతా''

''మొదటి చక్రవర్తి పోలిక పెద్దగా అక్కడే కొట్టొచ్చినట్టున్నది. తండ్రిగారికి డెత్‌వారంట్ అందగానే హరీష్‌ని పిలిచి, అదే మోడరన్ పేరు హరీష్ చంద్ర, దశరధుడు రాముని పిలిపించి తానిచ్చిన రెండు వరాలు చెప్పినట్లు, '' ఇల్లు నా కష్టార్జితం హరీష్! అది అమ్ముడు పోకుండా చూడు. నా యింట్లో నా సంతతి వారే వుంటే, నేను స్వర్గంలో వుండి చూసి తృప్తిపడతాను, ఖస్థిత దశరధునిలాగా నిన్ను దీవిస్తాను, ఇంట్లోని బలగంలో ప్రయోజకులెవరూ కనబడలేదు. అందుకని నీతో చెప్తున్నాను. మెతకతనం, తెలివితక్కువా కంటబడ్డాయి. పోనీ కనీసం నీ వంతు భాగమైనా నిలబెట్టు, దానిలో మీ అమ్మ వుంటుంది. హరీష్! నాయనా. అసలు న్యాయం చూస్తే యిల్లు నీదే నన్ను ఋణవిముక్తుని చేయటమే గాక, అజ్ఞానుల రుణాలూ చెల్లించావు'' అన్నాడు. ''తప్పకుండా నీ కోరిక తీరుస్తా. యిల్లు నిలబెడతా తాకట్టు పెట్టే వీలు లేకుండా చేస్తా. అమ్మేందుకసలే వీలు లేదు. నాది అన్నావుగా పితాజీ. ఐ ప్రామిస్. నాకు భాగం వద్దు. నా సంతతికీ రాదు. వాళ్ల మోడరన్ ఫ్లాట్సులో వుంటారు. భాగమెందుకు? నువ్వు పాతపద్ధతిలో కట్టించావు. భాగాలు చేసే వీలులేదు. కలిసే వుండాలి అందరూ అని నీ అభిప్రాయమేమో. నిశ్చింతగా పోవాలి పితాజీ'' అన్నాడు. ఆ మాట నిలబెట్టుకున్నాడు హరీష్‌చంద్ర.

''లా ప్రకారం వ్రాశాడా?'' ఆశ్చర్యపోయారందరు.

''లేదు మాట మీద నిలబడటమే గొప్పట. మూడవ తరం వారున్నారా భవనంలో. మా తాతగారూ నాన్నగారూ మా ఆయనా చెప్తుంటే విన్నా''.

శారద వచ్చి అందర్నీ లేవదీసింది. '' ఇవాళ నా పుట్టిన రోజు. విందున్నదని సర్క్యులర్ పంపానే? యెనిమిదన్నర అయింది. అన్ని పదార్థాలూ తయారుగా ఉన్నయ్యి. రావాలి. కథ వింటూ తన్మయులై మరచిపోయారేమో. రావాలి రావాలి. డైనింగ్ హాల్‌లో బల్లల మీద పళ్లేలూ, మంచి నీళ్ల గ్లాసులూ గూడా అమిర్చేశారు మెయిడ్స్. డ్రింకులన్నా తాగలేదివాళ. రండి. రండి'' అని పిలుచుకెళ్లింది.